ఐటీ కారిడార్‌కు బస్సు సర్వీసులు పెంచుతాం

● ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం అపర్ణ కల్యాణి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కేపీహెచ్‌బీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బస్సుల కోసం తప్పని తిప్పలు అనే శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. జేఎన్‌టీయూ నుంచి ఐటీ కారిడార్‌కు సరిపడా బస్సులు లేకపోవడంతో ఆ మార్గంలో ప్రయాణించే ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ కూకట్‌పల్లి రీజియన్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ అపర్ణ కల్యాణి స్పందించారు. ఐటీ కారిడార్‌లో ఇప్పటికే బస్సులు పెంచామని, ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించి బస్సులను పెంచే ప్రయత్నం చేస్తామని ఆమె పేర్కొన్నారు. మేడ్చల్, కూకట్‌పల్లి, హెచ్‌సీయూ డిపోల నుంచి బస్సులు పెంచితే డిమాండ్ తగ్గవచ్చు. అదేవిధంగా జేఎన్‌టీయూ చౌరస్తా నుంచే కాకుండా మూసాపేట్ చౌరస్తా, కూకట్‌పల్లి వైజంక్షన్, కేపీహెచ్‌బీ రోడ్ నంబర్ 1, నిజాంపేట్ ఎక్స్‌రోడ్ నుంచి ఐటీ కారిడార్ వరకు బస్సుల సంఖ్య పెంచితే ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది.

తప్పుల తడకగా కాళేశ్వరం విచారణ కమిటీ నివేదిక

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



గండిమైసమ్మలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు హాజరైన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కమిటీ ఇచ్చిన నివేదిక తప్పుల తడకని, బీఆర్ఎస్ పార్టీని, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులను అప్రదిష్ట పాల్జేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా తెలంగాణ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన కృషిని తెలియజేసేందుకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు మంగళవారం నగరంలోని తెలంగాణ భవన్ నుంచి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ ముఖ్య నాయకులు వీక్షించేందుకు గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరయ్యారు. హరీశ్ రావు ప్రజెంటేషన్ పూర్తయ్యాక ఎమ్మెల్యే మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ అనుమతులతోనే కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించారని, కేవలం రెండు పిల్లర్లు కుంగిపోతే రాద్ధాంతం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కార్మికులు, ఇంజనీర్లు మృతి ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు వీలైనంత త్వరగా మరమత్తులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

అమృత తండా వాసులకు ఇళ్లు కేటాయించండి..

వర్షాకాలంలో ఫతేనగర్ డివిజన్‌లోని అమృత తండా పక్కనే ఉన్న నాలా ఉధృతంగా ప్రవహించి ఇళ్లలోకి నీరు చేరి తండావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీరికి కైత్లాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని జెడ్సీ అపూర్వచౌహాన్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. మంగళవారం ఆయన ఫతేనగర్ కార్పొరేటర్ సతీష్‌గౌడ్‌తో పాటు జెడ్సీని కలిసి తండావాసులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. వర్షం వస్తే తండాలో ఉండలేని పరిస్థితి నెలకొందని, నిరుపేదలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తండావాసుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని జెడ్సీ అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఫతేనగర్‌వాసులు పాల్గొన్నారు.

చేజారిన ఎంటెక్ చాన్స్..!

● నేటి నుంచి పీజీఈసెట్ ప్రవేశాలకు ధ్రువపత్రాల పరిశీలన
● ర్యాంకులు పొందిన అభ్యర్థులకు బీటెక్ సర్టిఫికెట్లు ఇవ్వని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలు



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదవాలనుకుంటున్న విద్యార్థుల ఆశలపై ప్రైవేట్ కాలేజీలు నీళ్లు చల్లుతున్నాయా అంటే.. అవుననే అంటున్నారు తల్లిదండ్రులు. ఒకవైపు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడం, మరోవైపు బీటెక్ పూర్తయి రెండేళ్లయినా విద్యార్థులకు ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ధ్రువపత్రాలు ఇవ్వకపోవడంతో వేలాదిమంది విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు చేజారిపోతున్నాయి. పోస్ట్‌గ్రాడ్యుయేటెడ్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం పీజీఈసెట్ ర్యాంకులు పొందిన అభ్యర్థులకు బుధవారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం కానుండగా, ప్రైవేట్ కాలేజీల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు యాజమాన్యాలు ససేమిరా అంటున్నాయి. ప్రైవేట్ కాలేజీల మొండివైఖరితో ఉన్నత చదువులు చదవాలనుకుంటున్న తమ బిడ్డల ఆశలు అడియాశలే అవుతున్నాయని బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. తాజాగా కొందరు విద్యార్థులు, తల్లిదండ్రులు జేఎన్‌టీయూ అధికారులకు, సాంకేతిక విద్యా కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, కొన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. కమిషనర్ ఆదేశాలను సైతం కళాశాలల యాజమాన్యాలు ఖాతరు చేయడం లేదని, సర్టిఫికెట్లు ఇవ్వకుండా మొండిగా వ్యవహరిస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా కళాశాలలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రెండేళ్లుగా తీరని ఆకాంక్ష..

ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థిని కీర్తి నగర శివారులోని సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో గతేడాది బీటెక్ పూర్తి చేసింది. షెడ్యూల్ కులాలకు చెందిన తనకు నాలుగేళ్ల పాటు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరైనప్పటికీ, రెండేళ్లుగా కాలేజీ యాజమాన్యం సర్టిఫికెట్లను జారీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది. రెండేళ్లుగా పీజీఈసెట్ రాసి మంచి ర్యాంక్ తెచ్చుకున్నా, కళాశాల యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వని కారణంగా తమ బిడ్డ ఎంటెక్ అవకాశాలను కోల్పోతున్నదని తండ్రి వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఈ ఏడాదైనా తన బిడ్డ సర్టిఫికెట్లను సీవీఆర్ కళాశాల నుంచి ఇప్పించాలని సాంకేతిక విద్యా కమిషనర్‌కు వినతిపత్రం పంపారు. స్పందించిన ఉన్నతాధికారి బాధిత విద్యార్థి సర్టిఫికెట్లను వెంటనే జారీ చేయాలని సదరు కాలేజీ ప్రిన్సిపాల్‌కు సోమవారం నోటీసులు పంపారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను కలవగా సర్టిఫికెట్లు ఇచ్చేందుకు నిరాకరించారు. సాంకేతిక విద్యా కమిషనర్ నుంచి వచ్చిన ఆదేశాల విషయమై సీవీఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డిని ఫోన్ ద్వారా 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

జిల్లా ఆస్పత్రికి వెళ్లండి..

● కూకట్‌పల్లి యూపీహెచ్‌సీలో అందని చికిత్స
● డయాగ్నస్టిక్ సెంటర్‌లో ఫిల్మ్‌లు కరువు
● బాలాజీనగర్‌లో పేరుకే బస్తీ దవాఖానా



మధ్యాహ్నం 12.30కే తలుపులు మూసి ఉన్న యూపీహెచ్‌సీ

హైదరాబాద్ సిటీ/కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ బస్తీ దవాఖానాలో వైద్యుడు లేరని కూకట్‌పల్లి యూపీహెచ్‌సీకి వెళ్తే అక్కడా వైద్యులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఆస్పత్రికి వెళ్లిపొండని అక్కడి సిబ్బంది పేర్కొంటున్నారని వాపోతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ బాలాజీనగర్ బస్తీ దవాఖానాలోని వైద్యుడు గతనెల 31న పదవీ విరమణ చేశారు. మంగళవారం ఓ బాలుడి చికిత్స నిమిత్తం అక్కడకు వెళ్తే యూపీహెచ్‌సీకి వెళ్లాలని సిబ్బంది సూచించారు. అక్కడకు వెళ్తే డాక్టర్ లేరు.. జిల్లా ఆస్పత్రికి పొండని అక్కడి సిబ్బంది పేర్కొంటున్నారని పలువురు బాధితులు వాపోయారు. తాము ఉండగానే మధ్యాహ్నం 12.30కే దురుసుగా మాట్లాడుతూ తలుపు కూడా వేసేశారని తెలిపారు. కాగా, ఓపీ సమయం ఎంత వరకు అని ప్రశ్నిస్తే కాసేపటి తర్వాత సిబ్బంది వైద్యం కొనసాగించినట్లు మరి కొందరు పేర్కొన్నారు. ఇదిలాఉండగా యూపీహెచ్‌సీ ఆవరణలో ఉన్న డయాగ్నస్టిక్ సెంటర్‌లో ఎక్స్‌రే ఫిల్మ్‌లు కరువు అయ్యాయి. బాధితులకు ఫోన్లలో ఫొటోలు తీసి ఇస్తున్నారు.

బోనాల వల్లే: వైద్యురాలు

ఆస్పత్రి ముందు ఉన్న ఆలయం వద్ద మంగళవారం బోనాలు జరుగుతున్నాయని, అందువల్ల డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అనుమతితో మధ్యాహ్నం తర్వాత ఇంటికి వెళ్లినట్లు యూపీహెచ్‌సీ వైద్యురాలు మమత ఈ ఘటనపై వివరణ ఇచ్చారు. ఇక్కడ రోగులకు రోజూ చికిత్స అందుతోందని, బాధితులతో దురుసుగా మాట్లాడిన సిబ్బందిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పేరుకే బస్తీ దవాఖానాగా ఉండి బాలాజీనగర్‌లో వైద్యుడు లేకపోవడంపై డీఎంహెచ్‌ఓ ఉమాగౌరి స్పందిస్తూ ఇటీవల జిల్లాలో పది మంది కొత్త డాక్టర్లకు ఆర్డర్ ఇచ్చామని, త్వరలో వారు బాధ్యతలు చేపడతారని తెలిపారు.



బురద నీటిలో ఇబ్బంది పడుతూ నడుస్తున్న మహిళ

బురదమయంగా మారిన రోడ్లు

హైదర్‌నగర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో సోమవారం కురిసిన భారీ వర్షానికి శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు కాలనీల్లో నాలాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద నీటితో రోడ్లు నిండి ఉండటంతో జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో వరదనీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఉషాముళ్లపూడి రోడ్ గోవిందచౌరస్తా వద్ద డ్రైనేజీ పొంగిపొర్లుతుండటంతో ట్రాఫిక్ జామ్ అయింది. ఆల్విన్‌కాలనీతో పాటు వివేకానందనగర్, హైదర్‌నగర్‌లలో రోడ్లపై ఉన్న బురదనీటితో జనాలు అవస్థలు పడ్డారు.

వరద బాధితులను ఆదుకుంటాం

● టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేశ్



ఫతేనగర్ అమృత తండా వాసులతో మాట్లాడుతున్న బండి రమేశ్

కూకట్‌పల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గంలో వరద ముంపుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేశ్ అన్నారు. మంగళవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి ఫతేనగర్ డివిజన్‌లో అమృత తండా దీన్‌దయాళ్‌నగర్, ప్రభాకర్‌రెడ్డినగర్‌ల్లో పర్యటించారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరదనీరు చేరి నిత్యావసర సరుకులు పాడైపోయావని కాలనీవాసులు తెలిపారు. ఆహారం వండుకొని తినే పరిస్థితి లేదని, కట్టుబట్టలతో హౌసింగ్‌బోర్డులోని ఇందిరమ్మ గృహాల్లో తాత్కాలికంగా తలదాచుకుంటున్నామని తెలిపారు. అనంతరం బండి రమేశ్ వరద బాధితులు ఉంటున్న పునరావాస కేంద్రాని పరిశీలించారు. బాదితులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగిరెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు, లక్ష్మయ్య, కుక్కల రమేశ్, శివచౌదరి తదితరులు పాల్గొన్నారు.



వేముకుంటలో దోమల నివారణపై
అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్, ఉపకమిషనర్ తదితరులు

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహించొద్దు

చందానగర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి అలసత్వం వద్దని చందానగర్ కార్పొరేటర్ మంజులారఘునాథ్ రెడ్డి అన్నారు. చందానగర్ డివిజన్ వేముకుంటలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సర్కిల్ ఉపకమిషనర్‌తో కలిసి కాలనీలో పర్యటించారు. అనంతరం శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో దోమల నివారణ, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చెత్త తొలగించిన తర్వాత శుభ్రంగా ఉన్న ఇంకుడు గుంత

ఇంకుడు గుంతలో చెత్త తొలగింపు

గచ్చిబౌలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జూలై 26న ఇంకుడు గుంతల నిర్వహణ పట్టదా అనే పేరుతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సర్కిల్, జోనల్ కార్యాలయం ఆవరణలో ఇంకుడు గుంత చెత్తకుప్పగా మారింది. ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించి శుభ్రం చేశారు.

హెచ్‌సీయూలో 'ఎనర్జీ టెరాటెక్ సొల్యూషన్స్' స్టార్టప్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): టెరాహెర్ట్జ్ టెక్నాలజీతో ఆహార పరీక్షల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ఎనర్జీ టెరాటెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట స్టార్టప్‌ను స్థాపించినట్లు హెచ్‌సీయూ ప్రకటించింది. దేశంలో పాల, వ్యవసాయ ఉత్పత్తుల తాజాదనాన్ని పరీక్షించడానికి అవసరమైన రేడియేషన్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రొఫెసర్ ఏకే చౌదరి మార్గదర్శకత్వంలో స్టార్టప్‌ను నెలకొల్పుతున్నట్లు సహ వ్యవస్థాపకుడు డాక్టర్ చందన్ తెలిపారు. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన సదస్సులో ఈ స్టార్టప్‌ను ప్రదర్శించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రొఫెసర్ ఏకే చౌదరి మాట్లాడుతూ.. ఇది మా పరిశోధన బృందానికి మాత్రమే కాదు, మొత్తం విశ్వవిద్యాలయానికి గర్వకారణమన్నారు. తమకు మద్దతుగా నిలిచినందుకు హెచ్‌సీయూ యాజమాన్యానికి, స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ డీన్‌కు డాక్టర్ చందన్ ఘోరుయ్ కృతజ్ఞతలు తెలిపారు.



పాపిరెడ్డికాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



బీహెచ్ఈఎల్ చౌరస్తాలో జాతీయ రహదారిపై వర్షం నీరు



దంచికొట్టిన వర్షం.. ఇబ్బందులు పడిన ప్రజలు



లింగంపల్లి రైల్వేఅండర్ బ్రిడ్జి వద్ద చేరిన వరద నీరు

చందానగర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మంగళవారం మధ్యాహ్నం వర్షం దంచికొట్టింది. దీంతో పలు రహదారులు చెరువులను తలపించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారుల తీవ్ర అవస్థలు పడ్డారు. నియోజకవర్గంలోని పలు ఫ్లైఓవర్లపై సైతం ట్రాఫిక్ స్తంభించింది. కొండాపూర్, మాదాపూర్, చందానగర్, రాయదుర్గం, గచ్చిబౌలి ప్రాంతా ల్లో 20 నిమిషాల్లో చేరాల్సిన గమ్యస్థానం 45 నుంచి 50 నిమిషాల సమయం పట్టింది.

ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఫేజ్-1 కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై స్థానికులు వివేకానందనగర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్యే గాంధీని కలిసి వినతి పత్రం అందజేశారు. కాలనీలో యూజీడీ పైపులైన్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలోనే అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యలు పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకటేశంగౌడ్, జనరల్ సెక్రటరీ కుమారచారి, జాయింట్ సెక్రటరీ రఘు, కల్చరల్ సెక్రటరీ హేమలత, కాలనీ వాసులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న ఆల్విన్‌కాలనీ ఫేజ్-1 అసోసియేషన్ సభ్యులు

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత..

హఫీజ్‌పేట డివిజన్‌కు చెందిన లోకం గోపీనాథ్‌కు మంజూరైన రూ.60వేల సీఎం సహాయనిధి చెక్కును అతడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మారబోయిన రాజుయాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, జిల్లా గణేష్, ఎండీ ఇబ్రహీం, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



గుంతలమయంగా ఉన్న మసీదుబండ రోడ్డు

గుంతలతో ఇబ్బందులు

గచ్చిబౌలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లు గోతులమయంగా మారాయి. ఓ వైపు మాన్‌సూన్ టీంలు గోతులు పూడుస్తున్నప్పటికీ మరోవైపు రోడ్లన్నీ అధ్వానంగా మారుతున్నాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. మసీదుబండ నుంచి కొత్తగూడ రోడ్డు బొటానికల్ గార్డెన్ వరకు రహదారి పూర్తిగా ధ్వంసమైందని వాహనదారులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాహనాలను రోడ్ల పక్కన పార్క్ చేయొద్దు

గచ్చిబౌలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కొండాపూర్ బొటానికల్ గార్డెన్ ముందు రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేస్తే జరిమానాలు విధిస్తామని గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులు వాకర్స్‌ను హెచ్చరించారు. మంగళవారం ఉదయం బొటానికల్ గార్డెన్‌లో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ట్రాఫిక్ పోలీసులు మాట్లాడారు. ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో గార్డెన్‌కు వచ్చే వాకర్స్ తమ వాహనాలను రోడ్డు పక్కన కాకుండా పార్కింగ్ స్థలంలోనే నిలపాలని సూచించారు. రోడ్డుకు ఇరువైపులా ఇష్టానుసారం పార్కింగ్ చేస్తే జరిమానాలు విధిస్తామన్నారు. ఉదయం 8గంటల లోపు వాకర్స్ ద్విచక్రవాహనాలను ఒక లైనులో మాత్రమే గార్డెన్ ముందు పెట్టుకొవచ్చన్నారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఎస్సై రమేష్, సిబ్బంది, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



వాకర్స్‌తో మాట్లాడుతున్న ట్రాఫిక్ పోలీసులు



నిథమ్ విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

నిథమ్ రామమ్మకుంటను పరిశీలించిన హైడ్రా కమిషనర్

రాయదుర్గం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని నిథమ్‌లో ఉన్న రామమ్మకుంట చెరువును మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆయన బృందం తనిఖీ చేసింది. ఆయనకు ఎన్ఐటీహెచ్ఎం డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటరమణ స్వాగతం పలికారు. రామమ్మకుంటను పరిశీలించిన అనంతరం రంగనాథ్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో సమాజ భాగస్వామ్యం ముఖ్యమన్నారు. ఇక్కడ వాకింగ్ ట్రాక్, పరిసరాలను అభివృద్ధి చేయడానికి అవకాశం ఉందని, అన్ని రకాల మౌలిక వసతులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీకాంత్, ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, డీసీపీ రామ్‌రెడ్డి, డీఈ శివకుమార్, ఏఈఈ జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.



శానిటేషన్ కార్మికులకు పీపీఈ కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్

పారిశుధ్య కార్మికులకు పీపీఈ కిట్ల పంపిణీ

మియాపూర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో శానిటేషన్ కార్మికుల సేవలు అమోఘమని మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు వార్డు కార్యాలయంలో పీపీఈ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయాన్నే నగరాన్ని శుభ్రం చేసి ప్రజలకు మంచి వాతావరణం అందిస్తున్న శానిటేషన్ కార్మికులు ఎంతో గొప్పవారన్నారు.

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

గచ్చిబౌలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వగౌడ్ కోరారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల అపర్ణ సైబర్‌టవర్‌లో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి జగదీశ్వర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వర్షాకాలంలో విరివిగా మొక్కలు నాటి అవి వృక్షాలుగా మారే వరకు పోషణ బాధ్యత కూడా తీసుకోవాలని ప్రజలను కోరారు. వనమహోత్సవంలో భాగంగా జీహెచ్ఎంసీ అధికారులు ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తారని, ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా బోనాల వేడుకలు

గచ్చిబౌలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని తారానగర్, లింగంపల్లిలోని రేణుక ఎల్లమ్మతల్లి బోనాల ఉత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. భక్తులు బోనాలతో తరలివచ్చి అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం నిర్వహించిన ఫలహారం బండ్ల ఊరేగింపులో నాయకులు రవికుమార్‌యాదవ్, రాగం నాగేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ముగ్గురికి జైలు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్‌లో అల్వాల్ పోలీసులకు చిక్కిన ముగ్గురికి మేడ్చల్ అత్వెల్లి కోర్టు న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు. ఇందులో బోయిన్‌పల్లికి చెందిన ఎండీ రియాజ్, హరినాయక్‌లకు నాలుగు రోజులు శిక్ష, కొంపల్లికి చెందిన రాములుకు రెండు రోజుల జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. ఇలా ఉండగా, ఇప్పటి వరకు అల్వాల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 15 మంది వాహనదారులు మద్యం తాగి పట్టుబడగా, వీరిలో ఇద్దరికి సామాజిక సేవ చేయాలని న్యాయమూర్తి సూచించగా, మిగతా 13 మందికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

జీడిమెట్ల ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ఇద్దరికి..

గాజులరామారం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడుపుతూ జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులకు పట్టుపడిన ఇద్దరికి అత్వెల్లి కోర్టు మంగళవారం జైలు శిక్ష విధించింది. వీరిలో రాజేష్‌కుమార్ అనే వ్యక్తికి రెండు రోజుల జైలుతో పాటు రూ. 4 వేల జరిమానా, వెంకటేశ్వర్‌రెడ్డికి మూడు రోజులు జైలుతో పాటు రూ.6 వేల జరిమానా కోర్టు విధించింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు మంగళవారం జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు వారిని చర్లపల్లి జైలుకు తరలించినట్టు ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

తల్లి పాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం

గాజులరామారం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : తల్లి పాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ గాజులరామారం సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. గాజులరామారం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లి పాల వారోత్సవాన్ని తల్లులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన గంట లోపు పిల్లలకు తల్లి పాలు పట్టిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగా ఉంటారని, బిడ్డ పుట్టిన మొదటి నెల నుంచి ఆరు నెలల పాటు తల్లి పాటు ఇవ్వడం వల్ల వారి ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ప్రణతి, ఆశ వర్కర్ శోభిత, పొదుపు సంఘాల లీడర్ రూప పాల్గొన్నారు.

బాచుపల్లిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

నిజాంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లి మండలం, బాచుపల్లి గ్రామంలో ప్రభుత్వ భూమి సర్వే నంబరు 186లో వెలిసిన అక్రమ నిర్మాణాలను తహసీల్దార్ పూల్‌సింగ్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ భానుచందర్ ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో నేల మట్టం చేశారు. గత నాలుగు రోజులుగా కాంగ్రెస్ నాయకుల అండతో గదులు, బేస్‌మెంట్‌ల నిర్మాణం చేపట్టారు. ఈ విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదులు అందినా అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో కొద్ది వెనక్కి తగ్గిన అధికారులు చివరకు ప్రభుత్వ భూముల్లోని అక్రమ నిర్మాణాలను కూల్చి వేయించారు. కాగా, ఈ అక్రమ నిర్మాణాల విషయమై నిజాంపేట కార్పొరేషన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ రెండు రోజుల క్రితమే ముఖ్యమంత్రి కార్యాలయానికి, హైడ్రా కమిషనర్‌కు, మేడ్చల్ కలెక్టర్‌కు, తహసీల్దార్‌కు, నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్‌కు ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేశారు.

ఎస్ఐ ప్రేమ్‌సాగర్‌కు డీసీపీ అభినందనలు



జీడిమెట్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీ మీట్‌లో అత్యంత ప్రతిభ కనబరిచిన జీడిమెట్ల ఎస్ఐ ప్రేమ్‌సాగర్‌ను బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్, ఏసీపీ పి.నరేష్‌రెడ్డి, జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్‌లు అభినందించారు. క్రిమినల్ లాస్‌లో గోల్డ్‌మెడల్, లిఫ్టింగ్, ప్యాకింగ్, ఫార్వర్డింగ్‌తో మెడికల్‌లో అంశాల్లో రెండు సిల్వర్ మెడల్స్ సాధించినందుకు ఎస్ఐను అభినదించారు. పూణెలో జరిగే జాతీయ స్థాయి పోలీస్ డ్యూటీమీట్‌లో కూడా ప్రేమ్‌సాగర్ మెడల్స్ సాధించాలని వారు ఆకాంక్షించారు.

పూర్తికాని నాలా నిర్మాణం.. ఇళ్లలోకి వరద

- తడిసిన సామగ్రి
- గిరినగర్‌వాసుల అవస్థలు
- బాధితులకు భరోసా ఇవ్వని డీసీ

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బాక్స్ నాలా నిర్మాణంలో అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం రంగారెడ్డినగర్ డివిజన్ గిరినగర్ కాలనీ వాసులకు శాపంగా మారింది. సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి గిరినగర్‌లోని ఇళ్లలోకి వరద, మురుగు నీరు చేరి సామగ్రి అంతా నీటి పాలైంది. ఈ ప్రాంతంలో 2023 ఆగస్టులో రూ.90 లక్షలతో బాక్స్ నాలా నిర్మాణ పనులను మొదలు పెట్టారు. ఇక్కడ ఉన్న టెట్రా టూలింగ్ సిస్టమ్స్ పరిశ్రమ యాజమాన్యం తన కంపెనీ ముందు నుంచి నాలాను నిర్మించొద్దని అడ్డుకుంది. అధికారులు వారిని ఒప్పించేందుకు ఎలాంటి చర్యలు జరపకుండానే పనులను నిలిపివేశారు. దీంతో అప్పటి నుంచి వర్షాలు భారీగా కురిసినప్పుడు గిరినగర్‌లోని రెండు, మూడు వీధులల్లో వరద నీటి ప్రవాహం అధికంగా ఉంటోంది. అంతేకాకుండా ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

● ప్రతియేటా ఇలాగే జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య మరితం జఠిలంగా మారిందని, ఉన్నతాధికారులైనా స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఇలా ఉండగా, సోమవారం తమ ఇళ్లలోకి నీరు చేరిన విషయం తెలుసుకున్న కుత్బుల్లాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ (డీసీ) నర్సింహ గిరినగర్‌లో పర్యటించి ఫొటోలకు ఫోజులిచ్చి వెళ్లారు తప్ప తమను ఆదుకుంటామని, తమ సమస్యను పరిష్కరిస్తామని ఎలాంటి భరోసా ఇవ్వదని స్థానికులు వాపోయారు.



గిరినగర్‌లోని ఓ వీధిలో చేరిన వరద, మురుగునీరు



ఓ ఇంట్లోకి వచ్చిన నీటిని చూపిస్తున్న ఇంటి యజమాని

● కనీసం ప్రజాప్రతినిధులైనా తమ కాలనీలో బాక్స్ నాలా నిర్మాణానికి శంకుస్థాన చేసిన విషయం గుర్తు చేసుకొని, టెట్రా టూలింగ్ సిస్టమ్స్ పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి నాలా నిర్మాణాన్ని పూర్తి చేయించి తమకు ముంపు సమస్య నుంచి విముక్తి కలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరోగ్య భారత్‌గా తీర్చిదిద్దటమే స్వామీజీ కల

● భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ రాష్ట్ర చీఫ్ కో ఆర్డినేటర్ శ్రీధర్‌రావు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని ఆరోగ్య భారత్‌గా తీర్చిదిద్దటమే స్వామీ రామ్‌దేవ్ కల అని భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ తెలంగాణ రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్, పతంజలి యోగ్‌పీఠ్ హరిద్వార్ అధ్యక్షుడు జి.శ్రీధర్‌రావు అన్నారు. జీడిమెట్ల డివిజన్ సుచిత్ర గాయత్రినగర్‌లో మంగళవారం జరిగిన యోగా శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ నందనం కృపాకర్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యోగా శిక్షణ పొందిన 16 మందికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు కార్యక్రమంలో పతంజలి యోగాకేంద్రం గాయత్రినగర్ ఫేజ్-2 నిర్వాహకులు పవన్‌కుమార్ సింగ్, బ్రిజల్, శ్రీనివాస్, విజయ్, తోకల నగేష్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ధర్నాకు తరలివెళ్తున్న సీపీఎం నాయకులు

42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి: సీపీఎం

షాపూర్‌నగర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన ధర్నాకు ఆ పార్టీ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం మేరకు అసెంబ్లీలో తీర్మానం చేసి ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపిస్తే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆమోదించకుండా పక్కన పెట్టారని ఆరోపించారు. రిజర్వేషన్‌కు మతం రంగుపులిమి తమాషా చూస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కమిటీ సభ్యులు పసుల అంజయ్య, రావుల స్వాతి, కరుణాకర్, సునీల్, దుర్గానాయక్, బీరయ్య,కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు తప్పనిసరి: సీఐ

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : గోదాముల వద్ద సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ సూచించారు. మంగళవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో గోదాముల యజమానులతో ఆయన సమావేశమయ్యారు. నేరాల నియంత్రణ, కేసుల విచారణలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు.



శ్రీశైలంగౌడ్‌కు వినతిపత్రాలు అందజేస్తున్న కాలనీలవాసులు

నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి: కూన

షాపూర్‌నగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అబివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. నియోజకవర్గంలోని వివిధ కాలనీలు, బస్తీల నుంచి వచ్చిన వారు మంగళవారం ఆయనను షాపూర్‌నగర్ లోని నివాసం వద్ద కలిసి తమ ప్రాంతాల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి కూన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజంటేషన్‌ను వీక్షిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు,

కేసీఆర్‌కు అవినీతి మరక అంటించేందుకే..

● కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం

దుండిగల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎటువంటి అభివృద్ధికి నోచుకోక, బీడుబారిన తెలంగాణను మిషన్ కాకతీయ, కాళేశ్వరం వంటి ప్రాజెక్టులతో సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని, అతనికి అవినీతి మరక అంటించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం 'విచారణ కమిటీ నివేదిక' పేరుతో కుట్ర పన్నుతోందని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు కేసీఆర్ చేసిన కృషిని తెలియజేసేందుకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు మంగళవారం నగరంలోని తెలంగాణ భవన్ నుంచి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు వీక్షించేందుకు గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం అనంతరం పార్టీ నాయకులు మాట్లాడుతూ, కేసీఆర్, హరీశ్‌రావులను అప్రదిష్ట పాల్జేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుకుందన్నారు. పవర్‌పాయిట్ ప్రజెంటేషన్‌ను వీక్షించిన వారిలో ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్యను త్వరగా పరిష్కరించాలి: ఎమ్మెల్యే



ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీల ప్రజలు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కాలనీలు, బస్తీల్లో నెలకొన్న తాగునీటి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులను ఆదేశించారు. పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సూరారం డివిజన్‌కు చెందిన పలు కాలనీల ప్రజలు ఎమ్మెల్యేను కలిసి తమ కాలనీల్లోని నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. స్పందించిన వివేకానంద్ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి.. రోజు రోజుకూ విస్తరిస్తున్న కాలనీలు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినతి పత్రం అందజేసిన వారిలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్, సంక్షేమ సంఘం సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను, శివ గుప్తా, యాదయ్య, సురేష్‌బాబు, చంద్రశేఖర్, లత, లక్ష్మి, రమేష్, మహేష్, సదా నందం తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమ సంఘాలతోనే కాలనీల అభివృద్ధి'

నిజాంపేట ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట కార్పొరేన్ బాచుపల్లిలోని క్రాంతినగర్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. కమిటీ సభ్యులు మంగళవారం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డిని కలిసి కాలనీ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని కోరారు. అనంతరం వారు హన్మంత్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. సంక్షేమ సంఘాలతోనే కాలనీ అభివృద్ధి సాధ్యపడుతుందని, క్రాంతినగర్ కాలనీలో ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సెక్రటరీ జీవన్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నూతన సభ్యులు కోటేశ్వరరావు, రాఘవేంద్రరెడ్డి, కృష్ణచైతన్య, శ్రీధర్, వంశీ, హరిబాబు, బుగ్గారెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.